కార్మికులకు దుస్తుల అందజేత



సఫాయి కార్మికులతో ప్రవీణ్‌కుమార్ తదితరులు

జీడిమెట్ల: సమాజ సేవలో సఫాయి కార్మికుల పాత్ర గొప్పదని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం నంద్యాల మోహన్ సహకారంతో 130వ డివిజన్ కార్మికులకు దుస్తులు అందజేశారు. అనంతరం కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం



గురుస్వామి దొంతిరి నరసింహారెడ్డి

సుభాష్‌నగర్: అయ్యప్ప మాలదారులకు నిత్య అన్నదానం (భిక్ష) చేయనున్నట్లు గురు స్వామి దొంతిరి నరసింహారెడ్డి తెలిపారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని స్టీల్ సిటీ వద్ద ఎస్‌వీ కాంట వెనుకాల అయ్యప్ప మండపాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జనవరి 5వ తేదీ వరకు అయ్యప్ప మాల ధరించిన వారు ఈ అన్నదానంలో పాల్గొనాలని కోరారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12:30 నుంచి 1.30 భిక్ష కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వివరాలకు 93964 39396 కు సంప్రదించాలని పేర్కొన్నారు.

విషవాయువుల గాఢతతో ఉక్కిరిబిక్కిరి

నిజాంపేట్: ప్రగతినగర్ ఎలీప్ సమీపంలోని కాలనీ వాసులు గురువారం విష వాయువుల గాఢతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో, తిరిగి రాత్రి 7 గంటల సమయంలో ఎలీప్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ నుంచి విషవాయువులను గాలిలో వదలడంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై స్థానికులు పీసీబీ అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించగా.. సదరు పరిశ్రమను గుర్తించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే ఎలీప్ పారిశ్రామికవాడ ప్రాంతం నుండి విష వాయువులు వెలువడ్డాయా? లేక ప్రగతినగర్, గాజులరామారం అటవీ ప్రాంతంలో ఏదైనా వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వాయువులు వెలువడ్డాయా? అన్నది తేలాల్సి ఉంది.

మూసాపేట బంద్ ప్రశాంతం



బంద్ సందర్భంగా మూసివేసిన షాపులు

మూసాపేట: మూసాపేట బంద్ గురువారం సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. నగరంలో ముత్యాలమ్మ తల్లి ఆలయంపై దాడికి నిరసనగా హిందూ సంఘాల పిలుపు మేరకు ప్రజలు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. మూసాపేట పరిసర ప్రాంతాలు, భరత్‌నగర్, కూకట్‌పల్లిలో బంద్ నిర్వహించారు. అత్యవసర సేవలైన ఆసుపత్రులు, మెడికల్ షాపులు తప్ప అందరు బంద్‌లో పాల్గొన్నారు. హిందూ ఆలయాలపై దాడులు చేస్తే సహించేది లేదని నాయకులు హెచ్చరించారు. దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థి



గోపీచంద్

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి గోపీచంద్ తైక్వాండో పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. గురువారం నగరంలోని నాగోల్, బండ్లగూడలో గల జీబీఎల్ స్పోర్ట్స్ అకాడమీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టోర్నమెంట్ సెలక్షన్స్‌లో గోపీచంద్ మొదటి స్థానం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్ అభినందించారు.

వాతావరణం చాలా కీలకం



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాయదుర్గం: వాతావరణం చాలా ముఖ్యమని, ప్రస్తుతం వివిధ రకాలుగా మారిపోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఏఐసీ సీఈఓ రవి సర్కునస్ పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సోషల్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో కోహ్లీ రీసెర్చ్ బ్లాక్‌లో 'స్టార్టప్ ఇన్నోవేషన్ ఇన్ క్లైమేట్ యాక్షన్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలు పరిష్కార మార్గాలను అందించడంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రిటీష్ హైదరాబాద్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ, ఆర్‌ఐసీహెచ్, ఈపీఏఎం సిస్టమ్స్, స్టేట్ స్ట్రీట్స్, క్యాస్పియన్, ఐఈఈఎంఏ, కార్పొరేట్, పెట్టుబడిదారు, ఇంక్యుబేటర్ల ప్రతినిధులు, విద్యావేత్తలు, పర్యావరణ వ్యవస్థ వాటాదారులు పాల్గొన్నారు.

ఐసెట్-2024 కన్వీనర్‌పై చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఐసెట్-2024 కన్వీనర్ నరసింహాచారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టా రెడ్డిని కలిసి ఐసెట్ కన్వీనర్‌ను తొలగించాలని వినతి పత్రాన్ని అందజేసినట్లు పీడీఎస్‌యూ నాయకులు ఎస్.నాగేశ్వర్ రావు, సుమంత్ తెలిపారు. ఉన్నత విద్య మండలి విడుదల చేసిన రూ.92.76 లక్షల నిధుల్లో నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.30 లక్షలు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. దీనిపై న్యాయ విచారణ చేపట్టి కన్వీనర్ నరసింహాచారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికుల ప్రాణం.. గాలిలో దీపం

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కొరవడటంతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ఎలాంటి సేఫ్టీ తీసుకోకుండానే కార్మికులతో యాజమాన్యాలు పనులను చేయిస్తున్నాయి. ఈ క్రమంలో కార్మికులు అనుకోకుండా ప్రమాదాలతో మృత్యువాత పడుతున్నారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని, యాజమాన్యాలకు తొత్తులుగా మారుతున్నారని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. భవిష్యత్‌లోనైనా కార్మికులు ప్రాణాలు కోల్పోకుండా యాజమాన్యాలు భద్రతా చర్యలు తీసుకునేలా అధికారులు తనిఖీలు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదపుటంచున కార్మికుల బతుకులు



- భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- అధికారుల తనిఖీలు అంతంతే

జీడిమెట్ల: జీడిమెట్ల పారిశ్రామికవాడలో సుమారు 1000కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. కాగా వీటిల్లో ఫార్మా, బల్క్‌డ్రగ్, ఇంజనీరింగ్, రీసైక్లింగ్ పరిశ్రమల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిశ్రమల్లో ప్రతిరోజు రెగ్యులర్ పనులతో పాటు మెయింటెనెన్స్ పనులు జరుగుతూనే ఉంటాయి. పరిశ్రమల నిబంధనల ప్రకారం పరిశ్రమలో కార్మికుడు పనిచేసే క్రమంలో భద్రతా ప్రమాణాలు పాటించేలా యాజమాన్యాలు చూడాలి. కానీ కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించి చేయించుకుంటున్నాయి. ఏమైనా ప్రమాదం జరిగితే యాజమాన్యానికి, తమకు బాధ్యత కాదంటూ ముందుగానే కార్మికులతో పేపర్లపై సంతకాలు తీసకుంటున్నారు. సదరు కాంట్రాక్టర్ ఎలాంటి సేఫ్టీ పద్ధతులు లేకుండానే కూలీలతో పనులు చేయిస్తున్నారు. ప్రమాదంలో ఎవరైనా కార్మికులు చనిపోతే మృతుడి కుటుంబానికి కాంట్రాక్టర్ మానవతా దృక్పథంతో కొంత చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు!

పరిశ్రమలో పనులు చేయించుకునే క్రమంలో కాంట్రాక్టర్ లేదా పరిశ్రమ యాజమాన్యం కార్మికుల భద్రతా ప్రమాణాలు పాటించేలా అధికారులు తనిఖీ చేయాలి. కార్మికులకు హెల్మెట్, హైరిస్క్ మాస్కులు, బూట్లు, కళ్లద్దాలు ఇవ్వకుండానే కార్మికులతో పనులు చేయిస్తున్నారు. పై అంశాలను పాటిస్తున్నారా? లేదా? అని తనిఖీ చేయకుండా సంబంధిత అధికారులు యాజమాన్యాలు ఇచ్చే కానుకలకు అలవాటు పడ్డారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ప్రమాదాల వివరాలు

గడిచిన 5 సంవత్సరాల్లో జీడిమెట్ల పారిశ్రామికవాడలో రసాయన రియాక్టర్‌లు, బాయిలర్స్ శుభ్రం చేసే క్రమంలో వివిధ పరిశ్రమల్లో 20 మంది కార్మికులు మృతి చెందారు. 10 మందికి పైగా గాయపడ్డారు.

- 2021 జూలై 17 జీడిమెట్ల ఫేజ్-5లోని అర్ట్ ల్యాబ్ పరిశ్రమలో యశోదా అనే స్వీపర్ మంటల్లో చిక్కుకుని చనిపోయింది.
- 2021 జూలై 28న నాసెన్స్ ల్యాబ్ పరిశ్రమలో రసాయన బాయిలర్ పేలి షిఫ్ట్ ఇన్‌చార్జి హరిప్రసాద్‌రెడ్డి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మరో ఇద్దరు కార్మికులు నందకిషోర్, అర్జున్‌లకు గాయాలయ్యాయి.
- 2022 జనవరి 28న జీడిమెట్లలోని అట్లల పరిశ్రమ వద్ద అన్‌లోడింగ్ చేస్తుండగా బండిల్ మీద పడి కమలాకర్ రెడ్డి అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు.
- 2023 జనవరి 30న గంపల బస్తీలో డ్రమ్ము పేలి విజయ్ ప్రజాపత్ అనే కార్మికుడు తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయాడు.
- 2023 ఫిబ్రవరిలో రాంరెడ్డినగర్‌లోని కార్తికేయ కామేశ్వర రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలి శ్రీరాములు అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు.
- 2023 మార్చిలో అరోర్ ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ శుభ్రపరుస్తుండగా కుమార్ సరెన్, నరేంద్ర అనే కార్మికులు మృతి చెందారు.
- 2023 నవంబర్ 12న శ్రీశ్రీ కెమికల్స్ పరిశ్రమలో నుంచి వెలువడిన రసాయనాలతో ఐదుగురు పక్క పరిశ్రమ కార్మికులు అస్వస్థతకు గురయ్యారు.
- 2024 ఏప్రిల్ 4న బాలాజీ ఇంజనీరింగ్ పరిశ్రమలో క్రేన్ సాయంతో రియాక్టర్ లిఫ్ట్ చేయగా.. అది మీద పడి జనార్దన్ నాయుడు అనే కార్మికుడు అక్కడే ప్రాణాలు కోల్పోయాడు.
- 2024 అక్టోబర్ 16న సాబూరి ఫార్మా పరిశ్రమలో ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు వ్యాక్యూం ట్యాంక్‌లో పడి రాము, లక్ష్మణ్ అనే కార్మికులు మతి చెందారు. సురేందర్‌రెడ్డి అనే కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.



స్యూటిక్ ఫార్మా పరిశ్రమలో గాయపడిన కార్మికుడు (ఫైల్)

పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



మొక్కకు నీళ్లు పోస్తున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి



మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అవినాష్ మహంతి

- ఫిర్యాదులను పరిశీలించి దర్యాప్తు చేయాలి
- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

దుండిగల్: విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. మేడ్చల్ డీసీపీ పరిధిలోని దుండిగల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. రిసెప్షన్‌లో ఫిర్యాదుల స్వీకరణ, వివిధ అంశాలపై ఆరా తీశారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ..సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు పోలీస్ వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఏ ప్రాంతంలోనైనా నేరం జరిగితే జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి సత్వరమే బాధితులకు న్యాయం చేస్తున్నామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, డీఐ సతీష్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని మేయర్‌కు వినతి



మేయర్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

నిజాంపేట్: మత్స్య పరిశ్రమ, పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గురువారం ముదిరాజ్ సంఘం సభ్యులు మేయర్ కొలన్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా మత్స్య పరిశ్రమ ఏర్పాటు అయితే ముదిరాజ్‌లకు జీవనోపాధి లభిస్తుందని వివరించారు. దీనిపై స్పందించిన మేయర్.. అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్, నాయకులు ఆవుల జగన్‌యాదవ్, తలారి సాయి ముదిరాజ్ పాల్గొన్నారు.

మట్టికుప్పలను తొలగిస్తారా?



జగద్గిరిగుట్ట నుంచి గాంధీ నగర్‌కు వెళ్లే రోడ్డులో రాకపోకలకు అడ్డుగా ఉన్న కుప్ప

రంగారెడ్డినగర్: వరదనీరు సాఫీగా వెళ్లేందుకు ఐలా ఆధ్వర్యంలో రూ.1.65 కోట్ల నిధులతో చేపట్టిన డ్రైయిన్ నాలా పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తైనా నాలా కోసం గోతులు తవ్వగా వెలువడిన వ్యర్థాలు, మట్టిని సదరు కాంట్రాక్టర్ రోడ్డుపైనే కుప్పలుగా పోసి చేతులు దులుపుకున్నాడు. దీంతో గాంధీ నగర్– జగద్గిరిగుట్ట రహదారి గుండా పారిశ్రామికవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టికుప్పలు అడ్డుగా ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మట్టి కుప్పలను తొలగించి రాకపోకలకు ఆటంకాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

WANTED LADY TEACHERS
HEAD MASTER / PRINCIPAL
High School : ENGLISH, PHYSICS
Lower Class : ENGLISH, SCIENCE
PET & Incharges
KPHB COLONY 90328 58238 87907 57788

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి

సుభాష్‌నగర్: సూరారంలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌తో కలిసి గురువారం తనిఖీ చేశారు. నిత్యం 100కు పైగా రిజిస్ట్రేషన్ అయ్యే ఈ కార్యాలయంలో 60 శాతం మేర రిజిస్ట్రేషన్ పడిపోవడంపై ఆరా తీశారు. కుత్బుల్లాపూర్‌లోని సర్వే నెంబర్ 55 నుంచి 226 వరకు 171 సర్వే నెంబర్లలో వక్ఫ్ బోర్డు భూములు ఉన్నాయని కొంత మంది ఫిర్యాదుతో అందులో రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆగస్టులో వక్ఫ్ బోర్డు నుంచి ఆదేశాలు రావడంతో నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

సస్పెన్షన్‌పై పునరాలోచన చేయాలి

బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్



ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్ తదితరులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన తనపై కొందరు వ్యక్తులు కక్షపూరితంగా వ్యవహరించి సస్పెన్షన్ వేటు వేశారని, పార్టీ పెద్దలు పునరాలోచన చేయాలని బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావును వరంగల్‌లోని ఆయన నివాసంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. బీజేపీ జిల్లా ఇన్‌ఛార్జి మల్లారెడ్డి నిజనిజాలు తెలుసుకోకుండా కొందరి మాటలు విని తనతో పాటు నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారని, దీంతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని వివరించారు. కార్యక్రమంలో నల్ల జయశంకర్, అరుణ్ రావు, చందు, ముఖేష్, శ్యామ్ కుమార్ రెడ్డి, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బుక్ చేస్తే నాపరాయి వచ్చింది

దుండిగల్: ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ల్యాప్‌టాప్ బుక్ చేస్తే నాపరాయి, పాత కీ బోర్డు వచ్చింది. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ గ్రామానికి చెందిన ప్రణయ్ ఈ నెల 21వ తేదీన ఆన్‌లైన్‌లో అమేజాన్ యాప్‌లో ల్యాప్‌టాప్ కొనుగోలు చేశాడు. గురువారం అమేజాన్ నుంచి పార్సిల్ రావడంతో విప్పి చూడగా.. పాత కీబోర్డు, నాపరాయి ఉండటంతో ప్రణయ్ ఆశ్చర్యపోయాడు. తాను మోసపోయానని గ్రహించి దుండిగల్ పోలీసులను ఆశ్రయించాడు. తగిన ఆధారాలతో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారని బాధితుడు తెలిపాడు.

ప్రియాంకా గాంధీ ఓటమికి కేరళలో ప్రచారం చేస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రియాంకా గాంధీకి వ్యతిరేకంగా కేరళలో ప్రచారం చేయనున్నట్లు సోతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఓయూ న్యాయకళాశాల విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రియాంకా గాంధీని ఓడించి స్థానిక (కేరళ రాష్ట్రం) అభ్యర్థుల గెలుపు కోసం సోతిండియా పొలిటికల్ జేఏసీ బృందం ప్రచారం చేస్తుందన్నారు.

భారీగా కాలం చెల్లిన టపాసులు స్వాధీనం



కేపీహెచ్‌బీకాలనీ: అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో క్రాకర్స్‌ను నిల్వ ఉంచడమే కాకుండా కాలం చెల్లిన పటాకులను విక్రయించేందుకు ప్లాన్ చేసిన వ్యక్తిపై కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట మారుతీనగర్‌కు చెందిన ముఖేష్ అగర్వాల్ అనే వ్యాపారి హైదర్‌నగర్ మెట్రో పిల్లర్ 658 సమీపంలో అక్రమంగా క్రాకర్స్‌ను నిల్వ ఉంచడమే కాకుండా భారీగా కాలం చెల్లిన టపాసుల విక్రయానికి ప్లాన్ చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి రూ.1,71,407ల విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్కును ప్రారంభించరా?

- రూ. 2 కోట్లతో రెండు ఎకరాల్లో ఏర్పాటు
- సందర్శకులను ఆకట్టుకునేలా పచ్చదనం
- ప్రజలకు అందుబాటులోకి రాని వైనం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్ కాలనీల మధ్య గల స్వచ్ఛబడి (హుడా) పార్కును నాటి రాష్ట్ర ప్రభుత్వం ఎన్విరాన్‌మెంట్ పార్కు కోసం అందమైన పార్కుగా తీర్చిదిద్దింది. సకల సౌకర్యాలు కల్పించారు. ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన చేసి పనులను కూడా అంతే శరవేగంతో పార్కు అభివృద్ధికి బాటలు వేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎన్విరాన్‌మెంట్ పార్కు పేరుతో పార్కులో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించటానికి ప్లాస్టిక్ వస్తువుల రీసైక్లింగ్ కోసం మౌలిక వసతుల కల్పన, మొక్కల పెంపకం, ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించే విధంగా ఏర్పాటు చేశారు. నూతన టెక్నాలజీతో కూడిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల ద్వారా స్క్రీన్‌లు సైతం ఏర్పాటు చేశారు. నగరంలోనే ఈ స్వచ్ఛబడి పార్కును ఎన్విరాన్‌మెంట్ పార్కుగా సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. కోట్ల రూపాయలతో నిర్మించిన పార్కును ప్రారంభించాలని కాలనీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.





చిన్నారులు ఆడుకునే వస్తువులు, వాకింగ్ ట్రాక్

చెత్త తరలింపులో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే వివేకానంద్



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, చెత్త తరలింపులో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. పెండింగ్ పనులు, నిర్మాణ దశలో ఉన్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు రోగాల బారిన పడకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అదేవిధంగా ఓపెన్ జిమ్‌లు, పార్కులను సక్రమంగా నిర్వహించడంతో పాటు నూతన ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పార్కుల్లో హైమాస్ లైట్లు, మంజీర నీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. అదేవిధంగా వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం కాలనీలల్లో తవ్విన రోడ్లకు ప్యాచ్ వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రగతినగర్ శ్మశాన వాటికలో బోరు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఇన్‌చార్జి కమిషనర్ దిలీప్ కుమార్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వివేకానంద్ అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్‌ఐ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

సూరారం కాలనీకి చెందిన వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజబుల్డ్ సభ్యులు ఎమ్మెల్యేను పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. కరోనాకు ముందు సూరారం కాలనీ నుంచి సికింద్రాబాద్ వరకు 20 బస్సు సర్వీసులు నడిపే వారని, కరోనా తర్వాత కేవలం సూరారం కాలనీ నుంచి ఆరు బస్సు సర్వీసులను మాత్రమే నడిపిస్తున్నారని తెలిపారు. దీంతో సూరారం కాలనీ, రాజీవ్ గృహకల్ప ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జీడిమెట్ల డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రజల సౌకర్యార్థం బస్సు సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ అంజయ్యగౌడ్, జనరల్ సెక్రెటరీ నరేందర్‌రెడ్డి, సభ్యులు సత్యం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029